
సాక్షి బాపట్ల

మంగళవారం । 25 । జూలై । 2023




పశ్చిమ డెల్టాకు 2200 క్యూసెక్కులు

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 2,200 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 492 క్యూసెక్కులు వదిలారు.



దుర్గమ్మ సేవలో బేబి చిత్ర బృందం

విజయవాడ: దుర్గమ్మను బేబి చిత్ర బృందం సోమవారం దర్శించుకుంది. నటీనటులు ఆనంద్ దేవరకొండ, వైష్ణవి, విరాజ్ అశ్విన్, డైరెక్టర్ సాయి రాజేష్ అమ్మవారికి పూజలుచేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 516.40 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,088, ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ ప్రాంతీయ సమన్వయకర్తగా విజయసాయిరెడ్డి



పట్నంబజారు: వైఎస్సార్ సీపీ పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి(నాలుగు నియోజకవర్గాలు) జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్‌గా రాజ్య సభ సభ్యులు వి.విజయసాయిరెడ్డి నియమితులయ్యారు. సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రీజనల్ కో–ఆర్డినేటర్‌గా ఆయన్ని నియమిస్తూ సోమవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

మిర్చి యార్డుకు 34,937 బస్తాల రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మిర్చి మార్కెట్ యార్డుకు సోమవారం 34,937 బస్తాలు వచ్చాయి. గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 33,358 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.25,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.26,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాకు రూ.11,000 నుంచి 23,500 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.11,500 నుంచి రూ.25,200 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,933 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

27న నిధి ఆప్‌కే నికట్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ఈనెల 27న నిధి ఆప్‌కే నికట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్స్–మిసిలీనియస్ ప్రొవిజన్స్ యాక్ట్–1952 ప్రకారం పీఎఫ్ పరిధిలోకి వచ్చే యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లు ప్రాంతీయ కార్యాలయ పరిధిలోని జిల్లాల్లో ఈనెల 27న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్న సమావేశాలకు విధిగా హాజరు కావాలని సూచించారు. ఫిర్యాదులను పరిష్కరించేందుకు వీలుగా పీఎఫ్ అధికారులు హాజరు కానున్నారని వివరించారు. నల్లపాడులోని సెయింట్ జోసఫ్ బాలికల జూనియర్ కళాశాల, కృష్ణాజిల్లా గుడ్లవల్లేరులోని ఎన్‌సీఎఫ్–వీడీఎస్ ఐటీఐ కళాశాల, ప్రకాశం జిల్లా మార్కాపురంలోని డాక్టర్ శామ్యూల్ జార్జ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ, ఎన్టీఆర్ జిల్లా కొండపల్లిలోని ఐలా–ఐడా సొసైటీ భవనం, బాపట్ల జిల్లా కావూరిపాలెంలోని రాయల్ మెరైన్ ఇంపోర్ట్స్, పల్నాడు జిల్లా యడ్లపాడులోని ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్ సమావేశ మందిరంలో అధికారులు, పీఎఫ్ వాటాదారులు, యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లతో సమావేశాలు జరుగుతాయని వివరించారు.

గుంటూరు బ్రాంచి కెనాల్‌కు నీటి విడుదల



నకరికల్లు: ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు గుంటూరు బ్రాంచి కెనాల్(జీబీసీ)కి నీటిని విడుదల చేసినట్లు ఎస్ఎస్పీ ఈఈ మురళీధర్ తెలిపారు. స్థానిక హెడ్‌రెగ్యులేటర్ నుంచి జీబీసీలోకి సోమవారం నీరు విడుదల చేశారు. మురళీధర్ మాట్లాడుతూ బుగ్గవాగు నుంచి మెయిన్ కెనాల్‌కు 5,500 క్యూసెక్కులు వస్తుండగా జీబీసీకి 2 వేల క్యూసెక్కులు వదిలినట్టు చెప్పారు. జీబీసీ నుంచి 10 ఆర్ చిలుకలూరిపేట మేజర్‌కూ విడుదల చేస్తున్నట్లు తెలిపారు. నకరికల్లు ఎస్ఎస్ ట్యాంకు ద్వారా నరసరావుపేట, చిలుకలూరిపేట, సత్తెనపల్లి మున్సిపాలిటీలకు మంగళవారం నుంచి నీటిని విడుదల చేస్తామన్నారు. నీటిలభ్యత తక్కువగా ఉన్నా.. తాగునీటి అవసరాలు తీర్చేందుకు వదులుతున్నట్టు వెల్లడించారు.



సంక్షేమ రేడుకు 'అపురూప' కానుక : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లబ్ధిదారులతో దిగిన చిత్రపటాన్ని బహూకరిస్తున్న మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు. చిత్రంలో నందిగం సురేష్, ఆదిమూలపు, జోగి రమేష్, రోశయ్య, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సామినేని ఉదయభాను, ఏసురత్నం తదితరులు



విజయస్థూపం : పైలాన్‌ను ఆవిష్కరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులు రజిని, అంబటి

నమహోం

వర్షపు జల్లులే ముత్యాల అక్షింతలై కురిసినట్టు.. వెంకటపాలెం వేంకటేశుని వేదమంత్రాలే దివ్యాశీస్సులై వినిపించినట్టు.. మంగళాద్రి లక్ష్మీనరసింహుడి గర్జనలే మేళతాళాలై మోగినట్టు.. కృష్ణమ్మ పరవళ్లే సప్తస్వరాలై లయబద్ధంగా వీనుల విందు చేసినట్టు.. ఇంద్రకీలాద్రి విజయదుర్గ ఇల దిగి వచ్చి త్రిశూలధారియై నర్తించినట్టు.. అంబరాన ఉన్న అమరావతి కన్నుకుట్టేలా.. నేలపై జన రాజధాని ఇంద్రధనుస్సై మెరిసినట్టు.. కృష్ణాయపాలెం నిండా సంబరమై మురిసింది. పేదల సొంతింటి కల సాకారానికి అన్నీ మంచి శకునములే అని నినదించింది. జననేత మాటే 'శాసన'మైందని, అమరావతి అందరిదని ఎలుగెత్తి చాటింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జేజేలు పలికింది. అశేష జనవాహిని మోముల్లో కోటి కాంతులు నింపింది.

మురిసిన జన రాజధాని

- 50,793 ఇళ్ల నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన
- ఇక అమరావతి అందరిదని సగర్వంగా ప్రకటించిన సీఎం
- రూ. 1,829.57 కోట్లతో ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం
- పండగ వాతావరణంలో అంగరంగవైభవంగా కార్యక్రమం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: సామాజిక అమరావతి ఇకపై మనందరిదని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సగర్వంగా ప్రకటించారు. పేదల వ్యతిరేకులంతా హైకోర్టులో 18, సుప్రీంకోర్టులో ఐదు కేసులు వేశారని, మూడేళ్ల పోరాటం తర్వాత పెత్తందారులపై పేదలు విజయం సాధించారని జన హర్షధ్వానాల మధ్య ఎలుగెత్తిచాటారు. సీఆర్‌డీఏ పరిధిలో ఈడబ్ల్యూఎస్ లేఅవుట్లలో రూ.1,829.57 కోట్లతో చేపట్టనున్న 50,793 ఇళ్ల నిర్మాణానికి, 45 సామాజిక మౌలిక వసతుల ప్రాజెక్టులకు మంగళగిరి మండలం కృష్ణాయపాలెం లేఅవుట్ వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. అనంతరం ఈపూరి మనీషా ఇంటి నిర్మాణానికి శాస్త్రోక్తంగా భూమి పూజ చేశారు. లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ మంజూరు పత్రాలు అందజేశారు. లేఅవుట్ల పరిధిలో రెండు దశల్లో రూ.168 లక్షలతో 28,000 మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ శుభ మహోత్సవానికి వర్షాన్నీ లెక్కచేయకుండా గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

మహాయజ్ఞంలా పేదలందరికీ ఇళ్లు పథకం

అనంతరం తుళ్లూరు మండలం వెంకటపాలెంలో జరిగిన సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, బాపట్ల ఎంపీ నందిగం సురేష్ మాట్లాడారు. తొలుత గుంటూరు కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగేళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరికీ ఇళ్లు పథకాన్ని మహాయజ్ఞంలా కొనసాగిస్తున్నారన్నారు. గతంలో ఇదే వేదికపై నుంచి సీఆర్డీఏ పరిధిలోని 1,402.58 ఎకరాల విస్తీర్ణంలో తీర్చిదిద్దిన 25 జగనన్న కాలనీలలో 50,793 మందికి ఇంటి పట్టాలను సీఎం పంపిణీ చేశారని, రెండు నెలలు కూడా తిరగక ముందే ఇప్పుడు గృహనిర్మాణాలకు శంకుస్థాపన చేయడం సంతోషమని పేర్కొన్నారు. రూ.1,829.57 కోట్లతో ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టినట్టు వివరించారు.



> తొలుత మోడల్ హౌస్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందర్శించారు. వసతులను తిలకించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంటిని దక్కించుకున్న ఈపూరి జీవరత్నం కుటుంబ సభ్యులకు గృహ పత్రాలు అందించారు.

ప్రజా రాజధాని సాకారం

మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో పేదలు ఉండకూడదని చంద్రబాబు కుట్రలు చేస్తే వాటిని ఛేదించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల దశాబ్దాల కలను నెరవేర్చిన రోజు ఇదన్నారు. చంద్రబాబు రైతుల ముసుగులో దళారులను ప్రోత్సహించి కోర్టుల్లో కేసులు వేసినా భగవంతుడు తోడుగా ఉండటంతో సీఎం వైఎస్ జగన్ పేదలకు అండగా ఉండి ప్రజా రాజధానిని సాకారం చేశారన్నారు. అనంతరం లబ్ధిదారులకు సీఎం ఇంటి నిర్మాణ పత్రాలను అందజేశారు. లబ్ధిదారులతో మాట్లాడారు. వారితో కలిసి గ్రూపు ఫొటో దిగారు.

పాల్గొన్న ప్రజాప్రతినిధులు

ఈ కార్యక్రమంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి, గృహ నిర్మాణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు, ఎస్పీలు ఆరీఫ్ హఫీజ్, రవీంద్రబాబు, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ టి.విజయ్ కుమార్‌రెడ్డి, గుంటూరు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, శాసన మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, శాసన మండలి విప్ జంగా కృష్ణమూర్తి, శాసన సభ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ళ అప్పిరెడ్డి, మురుగుడు హనుమంతరావు, మర్రి రాజశేఖర్, కల్పలతా రెడ్డి, పోతుల సునీత, రుహుల్లా, చంద్రగిరి ఏసురత్నం, ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు, ఎమ్మెల్యేలు కిలారి వెంకట రోశయ్య, నంబూరు శంకరరావు, మహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్‌రావు, అన్నాబత్తుని శివకుమార్, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వెలంపల్లి శ్రీనివాస్, సామినేని ఉదయభాను, గుంటూరు మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పలు కార్పొరేషన్ల చైర్మన్లు అడపా శేషు, గౌతమ్ రెడ్డి, మందపాటి శేషగిరి రావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవర ప్రసాద్, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, గుంటూరు ఏఎంసీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, గుంటూరు డెప్యూటీ మేయర్లు సజీలా, బాలవజ్రబాబు, నాయకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, కత్తెర సురేష్ కుమార్, దేవినేని అవినాష్, బత్తుల బ్రహ్మానందరెడ్డి, నూరి ఫాతిమా, గులాం రసూల్ పాల్గొన్నారు.

స్పందన అర్జీలు పునరావృతమైతే చర్యలు

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా
- స్పందనలో 81 అర్జీలు స్వీకరణ

బాపట్ల: స్పందన, జగనన్నకు చెబుదాంలో సమస్యలపై వచ్చిన అర్జీలు పునరావృతమైతే ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టరు పి.రంజితాబాషా హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి సోమవారం అర్జీలు స్వీకరించారు. 81 అర్జీలను పరిశీలించి, క్షుణ్ణంగా పరిశీలిస్తే ప్రజలకు మేలు జరుగుతుందని కలెక్టరు తెలిపారు. జగనన్నకు చెబుదాం పోర్టల్లో పంచాయతీరాజ్, విద్యుత్ శాఖలకు సంబంధించిన అర్జీలు పునరావృతం అయ్యాయని చెప్పారు. ప్రజలలో నమ్మకం, సంతృప్తిస్థాయి పెరిగేలా పనిచేయాలని సూచించారు.

28న గ్రీన్ బాపట్లకు శ్రీకారం

గ్రీన్ బాపట్ల పేరుతో ఈనెల 28వ తేదీన జిల్లా వ్యాప్తంగా రెండు లక్షల మొక్కలు నాటుతున్నట్లు కలెక్టరు రంజిత్ బాషా తెలిపారు. బాపట్ల మండలం వెదుళ్లపల్లిలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా డి.ఆర్.డి.ఎ. ద్వారా ప్రతి మండలానికి అదనంగా వెయ్యి చొప్పున కూరగాయల మొక్కలు ప్రత్యేకంగా మహిళలకు పంపిణీ అందించనున్నట్లు వివరించారు. గర్భిణులకు పోషక విలువలు అధికంగా ఉండే 10 రకాల సరుకులను ఆగస్టు ఒకటో తేదీ నుంచి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన మండలాలలో విధిగా హాజరుకావాలని కోరారు. జగనన్న పాల వెల్లువ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించాలని సూచించారు. కోస్టల్ మేనేజ్మెంట్ ప్లాన్ కింద బాపట్లలోని బీచ్‌ల వివరాలను ప్రభుత్వానికి నివేదించామన్నారు. పర్యాటక రంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం సూచించిన మేరకు సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని చెప్పారు.



స్పందనలో అర్జీలు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

ప్రభుత్వ భవనాలు శరవేగంగా చేపట్టాలి

ప్రభుత్వ ప్రాధాన్యం భవనాలు శరవేగంగా నిర్మించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టరు పి.రంజిత్‌బాషా కోరారు. ఉపాధిహామీ పథకం నిధులతో చేపడుతున్న భవన నిర్మాణాలకు నిధుల కొరత లేదని ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా వాటిని పూర్తి చేయాలన్నారు. జగనన్న కాలనీలలో చేపట్టిన గృహ నిర్మాణాలలో ఆగస్టు 15వ తేదీ నాటికి 1,069 పూర్తి చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణం జాప్యంపై అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాలు ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలలలో చేపట్టేందుకు అధికారులు సంసిద్ధం కావాలన్నారు. సీఫుడ్ ఫెస్టివల్ ఈనెల 28, 29, 30 తేదీలలో విజయవాడలో జరుగుతుందన్నారు. కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రాలను కలెక్టరు విడుదల చేశారు. జిల్లాలోనూ సీఫుడ్ ఫెస్టివల్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టరు సిహెచ్.శ్రీధర్, డీఆర్ఓ కె.లక్ష్మీ శివజ్యోతి పాల్గొన్నారు.

స్థలాన్ని తప్పుడు పత్రాలతో రాయించుకున్నారు..

నా 15 సెంట్లు స్థలాన్ని పెద్ద కుమారుడు తన భార్య నాగమణి పేరుతో తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఇద్దరు కుమారులకు చేరి సగం ఇద్దమనుకున్నారు. పెద్ద కొడుకు మోసం చేశాడు. న్యాయం చేయాలి.

– ఓటికుంద వెంకటేశ్వరరెడ్డి, రాంభొట్లవారిపాలెం

మా రేషన్‌కార్డులో నుంచి మాపెద్దనాన్నను తొలగించాలి

మా రేషన్‌కార్డులో పెద్దనాన్న పేరు పొందుపరిచారు. ఎన్నిసార్లు చెప్పిన రేషన్‌కార్డులో మా పెద్దనాన్న పేరు తొలగించటం లేదు. కార్డులో పేరు తొలగించి న్యాయం చేయండి.

–ఎస్.మహేష్‌బాబు, నుగ్గునలంక, కొల్లూరు మండలం

గంజాయి ముఠా అరెస్ట్

బాపట్ల టౌన్: గంజాయి విక్రయిస్తున్న ముఠాను అరెస్ట్ చేసి, వీరి నుంచి 25 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని, తాగుతున్న 11 మందిని వెదుళ్లపల్లి సమీపంలోని బధిరుల పాఠశాల సమీపంలో అరెస్ట్ చేసినట్లు చెప్పారు. విశాఖపట్నానికి చెందిన దినేష్, గూండోడు వద్ద నుంచి స్టువర్టుపురానికి చెందిన బోగిరి ప్రదీప్, అతని స్నేహితుడు ప్రేమ్‌చంద్‌తో కలసి విక్రయిస్తున్నట్లు వివరించారు. వీరి నుంచి రూ.2.50 లక్షల విలువ చేసే 25 కిలోల గంజాయి, రూ.20 వేలు, 8 సెల్ ఫోన్లు, గంజాయి రవాణాకు ఉపయోగించిన స్విఫ్ట్ కారు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గంజాయి కేసును ఛేదించిన సిబ్బంది బాపట్ల రూరల్ సీఐ జి.వేణుగోపాలరెడ్డి, వెదుళ్లపల్లి ఎస్ఐ నాగశ్రీనులతో పాటు ఐదుగురు సిబ్బందికి ప్రశంసా పత్రాలను ఎస్పీ అందజేశారు.



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొట్టు

వేమూరు: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం సోమవారం నిర్వహించారు. చైర్‌పర్సన్ ఉప్పు శిరీషా, వైస్ చైర్‌పర్సన్లు షేక్ ఖాజామ, చలంచర్ల కనకదుర్గ, డైరెక్టర్లతో మంత్రి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అధ్యక్షత వహించారు. మంత్రి కొట్టు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మార్కెట్ యార్డుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ మార్కెట్ యార్డుల్లో ధాన్యం, జొన్నలు, మొక్కజొన్న, పసుపు కొనుగోలు కేంద్రాలు వలన యార్డుకు మంచి లాభాలు వచ్చినట్లు వివరించారు. పసుపు మార్కెట్ యార్డు దుగ్గిరాలలో ఉన్నప్పటికీ లంక గ్రామాల రైతుల మేలు కోసం వేమూరు మార్కెట్ యార్డులో పసుపు కొనుగోలుకు అనుమతి తీసుకొచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో బాపట్ల ఉడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, పాలక వర్గం డైరెక్టర్లు బెల్లకొండ శివపార్వతి, కొమ్మూరి రమణ, ఎంపీపీలు యల్లమాటి మోహన్, నరేంద్ర, జాలాది రూబేను, వెంకట లలితాకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు ఉదయ భాస్కరి పాల్గొన్నారు.



పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి కొట్టు వేదికపై మంత్రి మేరుగ

మహిళ ఆత్మహత్య

యద్దనపూడి: అనారోగ్యంతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ అనూక్ అందించిన వివరాలు.. మండలంలోని పోలూరు ఎస్సీ కాలనీకి చెందిన పోలూరి బుల్లెమ్మ(50) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈనెల 21వ తేదీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో పెట్రోలు పోసుకొని నిప్పు అంటించుకుంది. ఆమెను బంధువులు గుంటూరు జనరల్ ఆస్పత్రికి చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. ఈ మేరకు ఆస్పత్రి నుంచి వచ్చిన నివేదిక మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి


వెలగా అనిల్ (ఫైల్)

మార్టూరు: జాతీయ రహదారిపై కోనంకి సమీపంలో శుక్రవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో రెండు కళ్లు పోయి గుంటూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెలగా అనిల్(37) సోమవారం సాయంత్రం మృతి చెందాడు. వివరాలు.. 21వ తేదీన కోనంకి సమీపంలో పాల ట్యాంకర్‌ను కారు ఢీకొట్టిన ప్రమాదంలో నలుగురిలో ముగ్గురు అదే రోజు మృతి చెందిన సంగతి తెలిసిందే. కారు నడుపుతున్న అనిల్‌కు తీవ్ర గాయాలు కావడంతో గుంటూరు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రెండు కళ్లు తొలగించారు. చికిత్స పొందుతున్న అనిల్ పరిస్థితి విషమించి సోమవారం సాయంత్రం మరణించినట్లు బంధువులు తెలిపారు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న అనిల్‌కు భార్య సుభాషిణి, 12 ఏళ్ల కుమారుడు ఉన్నారు.


కృష్ణాయపాలెం జగనన్న కాలనీలో జరిగిన పేదల ఇళ్ల శంకుస్థాపనకు విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి విడదల రజని


సీఎం వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి అంబటి రాంబాబు


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి


సీఎం వైఎస్ జగన్‌తో మాట్లాడుతున్న బాపట్ల ఎంపీ నందిగం సురేష్

ఆనందం 'ఇంటి'ంతకాదయా!

సొంతింటి కల నెరవేరుతున్న వేళ
- కృష్ణాయపాలెం లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన
- సంతోషం వ్యక్తం చేసిన లబ్ధిదారులు
- మోడల్ హౌస్‌ను తిలకించేందుకు బారులు తీరిన జనం
- బాగా నిర్మించారంటూ కితాబు

మంగళగిరి: మండలంలోని కృష్ణాయపాలెం జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలకు సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. రాజధానిలోని 25 లేఅవుట్లలో 50వేలకు పైగా నివాసాలు నిర్మిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి లబ్ధిదారులతో శంకుస్థాపన ప్రాంతం కోలాహలంగా మారింది. వర్షాన్ని లెక్క చేయకుండా లబ్ధిదారులు తమ కుటుంబ సభ్యులతో కలసి లేఅవుట్‌లో నూతనంగా నిర్మించిన మోడల్ హౌస్‌ను, తమ తమ ప్లాట్లను చూసుకుని ఆనంద భరితులయ్యారు. మహిళలు భారీగా తరలివచ్చి మోడల్ హౌస్‌ను తిలకించి ఇల్లు చాలా అందంగా నిర్మించారని, అలాగే తాము కూడా నిర్మించుకుంటామని సంతోషం వ్యక్తం చేశారు.


పేదల ఇళ్లకు శంకుస్థాపనలో పాల్గొన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులు రజని, అంబటి, ఆదిమూలపు, జోగి రమేష్, ఎమ్మెల్యే ఆర్కే

పట్టరాని ఆనందంగా ఉంది..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మా ప్లాటులోనే ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం మా కుటుంబం చేసుకున్న అదృష్టం. సీఎం జగనన్న చాలా ఆప్యాయంగా పలుకరించి శంకుస్థాపన చేయించారు. ఇది మాకు జీవితంలో మరిచిపోలేని రోజు. ఇల్లు పొందిన మా లాంటి పేదలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటాం. ఈ రోజు మాకు పట్టరాని ఆనందంగా ఉంది.
– ఈపూరి మనీషా

జగనన్న మా దేవుడు..



పొలం పనులు చేసుకుని కుటుంబాలను పోషించుకునే మా లాంటి వారి జీవితంలో సొంతింటి కల నెరవేరుతుందనుకోలేదు. దేవుడిలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు స్థలం కేటాయించడమే కాకుండా ఇల్లు కూడా నిర్మిస్తుండటం ఆనందంగా ఉంది. నీటిపారుదల శాఖ కట్టపై ఇల్లు నిర్మించుకుని ఉన్నా ఎప్పుడు తొలగిస్తారో అనే భయంతో ఆందోళనతో జీవిస్తున్నాం. సొంతిల్లు రావడంతో ఎలాంటి ఆందోళన లేకుండా జీవనం సాగించేలా అవకాశం కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి, అండగా ఉంటాం.
– బండి మీనాక్షి, వడ్డేశ్వరం

పేదలంతా అండగా ఉంటాం..



గతంలో స్థలాలు ఇవ్వడానికే సంవత్సరాలు పట్టేది. ఇక ఇల్లు కట్టుకోవాలంటే ఎన్నో అడ్డంకులు దాటుకుని అప్పులు చేసి కట్టుకునే వారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు స్థలం ఇవ్వడమే కాకుండా వెంటనే ఇల్లు కూడా కట్టించి ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. చరిత్రలో ఎన్నడూలేని విధంగా పేదలకు సొంతింటి కల నెరవేరుస్తున్న సీఎం జగనన్నకు పేదలంతా అండగా నిలుస్తాం.
– దేగల వెంకాయమ్మ, పెనుమాక

జీవితాంతం రుణపడి ఉంటాం..



కూలీపని చేసుకుని వచ్చే ఆదాయంతో కుటుంబ పోషణ కష్టంగా ఉంటున్న ఈరోజుల్లో మా లాంటి పేదలకు ఇళ్లు కట్టడం అనేది కలలో పని. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చలువతో సొంతింటి కల నెరవేరుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది. ఉచితంగా స్థలంగా ఇచ్చి ఇల్లు కట్టిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఓటుతో రుణం తీర్చుకుంటాం.
– బదుగు భాగ్యలక్ష్మి, మెల్లెంపూడి

జగనన్న మా కోసం పోరాడారు..



కాలువ కట్టపై ఇల్లు వేసుకుని నివశిస్తున్నా ఎప్పుడు తొలగిస్తారో, ఎప్పుడు కాలువ పొంగి పొర్లుతుందోననే భయంతో దినదిన గండంగా జీవనం సాగిస్తున్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థలం ఇచ్చి ఇల్లు కట్టించనుండటంతో ప్రశాంతంగా జీవించే అవకాశం కలిగింది. పేదలైన ప్రతి ఒక్కరికీ సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో సీఎం జగనన్న ఎంతో పోరాడి పేద పక్షాన నిలిచి, వారి సొంతింటి కల నెరవేరుస్తుండటం చాలా సంతోషంగా ఉంది. ఇల్లు పొందిన ప్రతి పేద కుటుంబం జీవితాంతం సీఎం జగనన్నకు అండగా ఉంటారు.
– గుంపెన గోవర్ధని, వడ్డేశ్వరం

పేద మహిళల సొంతింటి కల నెరవేరింది



ఎంతోమంది పేదలు ఈ ప్రాంతానికి వలస వచ్చి ఏళ్ల తరబడి అద్దెలకు ఉంటున్నారు. ఇల్లు మారినప్పుడల్లా ఎంతోఇబ్బందిగా ఉండేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అంటూ ప్రతి పేద మహిళకు స్థలాన్ని ఇచ్చి ఇళ్లు కూడా నిర్మిస్తున్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నాం. జగనన్న ప్రభుత్వంలో ఇళ్లు లభించడం ఎంతో ఆనందించదగ్గ విషయం.
– ఈద సుధారాణి, ప్రకాష్‌నగర్, తాడేపల్లి

త్వరలోనే సొంత ఇంటిలోకి వస్తాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో మేము కూడా సొంత ఇంట్లోకి వస్తున్నాం. ఎన్నో సంవత్సరాల నుంచి అద్దె ఇంట్లో నివాసముంటున్నాం. మా ఏరియాలో ఒక సెంటు స్థలం కావాలంటే రూ.10లక్షల నుంచి 15 లక్షలు ఖర్చు చేయాలి, ఆ స్థలాలు కూడా కొండపోరంబోకో, అటవీ ప్రాంతమో అయి ఉంటుంది. జగనన్న పుణ్యమా అంటూ విశాలమైన రోడ్లు ఏర్పాటు చేసి సెంటు స్థలంలో చక్కటి ఇళ్లు నిర్మిస్తున్నారు.
– పెరవలి నిర్మల కుమారి, డోలాస్‌నగర్, తాడేపల్లి

ప్రజలకు మేలు చేసేవాడే నాయకుడు..



విమర్శలు రాజకీయాల్లో సర్వసాధారణం, కానీ ప్రతిపక్షంలో ఉన్నవారు తమ ఇష్టం వచ్చిన రీతిలో సైకో అంటూ పదే పదే ముఖ్యమంత్రిని విమర్శిస్తున్నారు. అతనే పేద ప్రజలకు అండగా ఉండి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారు. ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు కూడా నిర్మించి ఇస్తున్నారు. ముఖ్యమంత్రిని సైకో అన్నవారే సైకోల్లా ప్రవర్తిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పరిపాలన చేస్తున్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే.
– బొజ్జా నాగలక్ష్మి, సీతానగరం, తాడేపల్లి, గుంటూరు జిల్లా

ఎంతో ఆనందంగా ఉంది



ఈ రోజు నాకు ఎంతో ఆనందంగా ఉంది. జగనన్న నా పేరు మీద రూ.15 లక్షల విలువ గల ఇంటి స్థలాన్ని ఇచ్చి నన్ను తోబుట్టువులా ఆదుకున్నాడు. ఇప్పటి వరకు నాకు రూపాయి ఆస్తి కూడా లేదు. జగనన్న పుణ్యమా అంటూ నాకు ఆస్తి వచ్చింది. జగనన్న వచ్చిన తరువాత సంక్షేమ పథకాల వల్ల మా కుటుంబంలో మార్పు చోటుచేసుకుంది. భవిష్యత్తులో జగనన్నకు మహిళలందరూ మద్దతు పలుకుతారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా ఎదురులేని వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.
– వై.శశికళ, నులకపేట, తాడేపల్లి

35 ఏళ్లుగా అద్దెకు ఉంటున్నాం...



35 సంవత్సరాల నుంచి అద్దె ఇంట్లోనే కాలం వెళ్లబుచ్చుతున్నాం. ఎన్నోసార్లు స్థలం కొనుక్కోవాలని ఆశపడ్డాం. కానీ తాడేపల్లి ప్రాంతంలో అది సాధ్యపడలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్ల సొంత ఇంటి కల నెరవేరుతోంది. మాకు అద్దెల బాధలు తప్పుతాయి. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలు మా కుటుంబంలో ఎవరో ఒకరికి అందుతున్నాయి. నేను పుట్టిన తరువాత ఒక కుటుంబానికి ఇన్ని సంక్షేమ పథకాలు అందించడం ఇదే ప్రథమం.
– ఎస్‌కే నజీబా, నులకపేట, తాడేపల్లి

ప్రఖ్యాత శాస్త్రవేత్త కైర్లీతో విద్యార్థుల ఆన్‌లైన్ భేటీ

ఐలవరం(భట్టిప్రోలు): స్విట్జర్లాండ్‌లోని బ్రూక్ హెవెన్ ల్యాబ్‌లో పార్టికల్ ఫిజిసిస్ట్‌గా పనిచేస్తున్న ప్రఖ్యాత శాస్త్రవేత్త కైర్లీ భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మంగళవారం ఆన్‌లైన్‌లో సంభాషించారు. ఈ సందర్భంగా ఫిజికల్ సైన్స్, ఖగోళ శాస్త్రానికి సంబంధించిన అనేక సంక్లిష్టమైన ప్రశ్నలకు ఆమె పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. ఈ విశ్వంలో ఏలియన్స్ మనుగడ, విశ్వం ఎప్పుడు ఆవిర్భవించింది... ఎప్పుడు అంతరించబోతుందో... మార్స్ గ్రహంపై మానవుడు నివసించడం సాధ్యమేనా ఇలా అనేక ప్రశ్నలకు సమాధానాలు వివరణాత్మకంగా తెలియజేశారు. ఆమె ప్రస్తుతం ప్రపంచం ఆసక్తిగా ఎదురు చూస్తున్న అట్లాస్ ఎక్స్‌పర్‌మెంట్ ప్రాజెక్ట్‌లో కీలక శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. ఆమె ఇప్పటికే ఖగోళ, భౌతిక శాస్త్రాలకు సంబంధించిన ఎన్నో అంతు చిక్కని అంశాల పై ఉపన్యాసాలు చేశారు. ఐలవరం హైస్కూల్ ఆంగ్లోపాధ్యాయులు పచ్చారు హరికృష్ణ నాసాలోని శాస్త్రవేత్తగా పనిచేసిన జిమ్ ఆడమ్స్ ద్వారా ఆమెను ఆన్‌లైన్‌లో కలసి తమ విద్యార్థులతో సంభాషించాలని కోరగా అందుకు అంగీకరించారు. ప్రధానోపాధ్యాయులు మాచర్ల మోహనరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.


శాస్త్రవేత్త కైర్లీతో ఆన్‌లైన్‌లో మాట్లాడుతున్న ఐలవరం పాఠశాల విద్యార్థులు

మద్యం విక్రేతలు అరెస్ట్

బాపట్లటౌన్: ఇతర రాష్ట్రాల మద్యాన్ని తీసుకొచ్చి నిబంధనలకు విరుద్ధంగా విక్రస్తున్న ముగ్గురిని సెబ్ అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. సెబ్ సీఐ ఎస్.శ్రీనివాసరావు అందించిన వివరాలు.. బాపట్ల మండలం, స్టువర్టుపురం గ్రామానికి చెందిన వల్లభ ఝాన్సీ, ఉయ్యాల చంటి, భోగిరి సురేష్ ఇతర రాష్ట్రాల్లో లభ్యమయ్యే నాన్ డ్యూటీ పైడ్ లిక్కర్ బాటిల్స్‌ను ఎలాంటి అనుమతులు లేకుండా ఏపీకు తీసుకువచ్చి జిల్లాలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఈ విషయంపై నిఘా పెట్టడంతో ముగ్గురు నిందితులను సోమవారం రైల్వేస్టేషన్ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి మొత్తం 324 బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదుచేశామన్నారు. కార్యక్రమంలో సెబ్ ఎస్‌ఐ ప్రభుదాస్ పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపిస్తున్న సెబ్ సీఐ

సంచార జాతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ వీరన్న

బాపట్ల: సంచార జాతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంబీసీ చైర్మన్ పెంద్ర వీరన్న పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సమావేశం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సంచార జాతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన జీఓ నంబరు 61ను అమలు చేయటంతో పాటు ఎంబీసీ కులాలకు వంద యూనిట్లు విద్యుత్ రాయితీ కల్పిస్తూ ఇచ్చిన జీఓను అమలు చేయాలని కోరారు. సంచార కులాలను కించపరిచే విధంగా మాట్లాడే వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అమలు చేసిన ప్రతి కార్యక్రమాన్ని సంచార జాతుల వారు పొందటం వలన ఎంతో మేలు అని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ దివ్యాంగుల సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య, నాయకులు కొండేటి శ్రీను, పొగడ్త సాంబయ్య.చల్లా శ్రీను.బిట్రా వెంకటేష్.పెంద్ర సాయి, శామ్యూల్, చల్లా కొండయ్య, డేవిడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెంద్ర వీరన్న

ట్రాక్టర్ కింద పడి మహిళ మృతి

జే పంగులూరు: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన అలవలపాడులో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు.. చందలూరు గ్రామానికి చెందిన అత్తింటి వీరమ్మ(39) భర్త నిల్సన్‌తో బైక్‌పై వెంకటాపురం బంధువుల ఫంక్షన్‌కు బయలుదేరారు. అలవలపాడు గ్రామంలోకి వచ్చేసరికి ముందు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్‌ను దాటే క్రమంలో ఎదురు వస్తున్న నాలుగు చక్రాల వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ వెనక కూర్చున్న వీరమ్మ ఎడమ వైపు బైకు నుంచి కిందకు జారి పడింది. భర్త నిల్సన్ కుడివైపు పడ్డాడు. వెనుక నుంచి ఎడమ వైపు వస్తున్న ఇసుక ట్రాక్టర్, కింద పడిన వీరమ్మ మీదుగా వెళ్లింది. 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మార్గమధ్యలోని చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. భర్త నిల్సన్‌కు గాయాలు కాలేదు. మృతురాలు వీరమ్మకు ఒక బాబు, పాప ఉన్నారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన రేణింగవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతి చెందిన వీరమ్మ

రాగి, ఇత్తడి సామన్ల దొంగల అరెస్టు

ఇంకొల్లు(చినగంజాం): రాగి, ఇత్తడి సామన్లు దొంగిలిస్తున్న ముగ్గురిని ఇంకొల్లు పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ ఎస్‌కే నాయబ్ రసూల్ అందించిన వివరాలు.. పాత పేపర్‌లు, ప్లాస్టిక్ వస్తువులు, పాత ఇనుప సామన్లు ఏరుకునేందుకు వచ్చి తాళం వేసి ఉన్న ఇళ్లు టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇంకొల్లు గ్రామంలోని పర్చూరు రోడ్డులో ఇండియన్ ఆయిల్ పెట్రోలు బంకు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆటోను ఆపి అందులో ప్రయాణిస్తున్న యద్దనపూడి మండలం పూనూరు గ్రామానికి చెందిన దార్ల వెంకటమ్మ, దార్ల ఇశ్రాయేలు, మార్టూరు మండలం వలపర్ల గ్రామానికి చెందిన షేక్ హుసేన్‌ను అందుపులోకి తీసుకున్నారు. విచారించగా, పాత పేపర్లు, ఇనుప సామన్లు ఏరుకొనే క్రమంలో రాగి, ఇత్తడి వస్తువులను దొంగతనం చేస్తున్నట్లు ఒప్పుకున్నారని ఎస్‌ఐ పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పసుపు రైతులకు ఉచిత భోజనం

దుగ్గిరాల మార్కెట్ యార్డులోప్రారంభించిన చైర్మన్

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా దుగ్గిరాల పసుపు యార్డులో సోమవారం నుంచి రైతులకు ఉచిత భోజన ం అందజేస్తున్న మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ తెలిపారు. యార్డుకు వివిధ ప్రాంతాల నుంచి రైతులు వస్తుంటారని, వారికి ఉచిత భోజన సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సూచనలతో ఉచిత భోజన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, యార్డు సెక్రటరీ శ్రీనివాసరావు, దుగ్గిరాల సర్పంచి బాణావత్ ఖుషీబాయి పాల్గొన్నారు.